www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 20 అక్టోబర్ 2023
5
చిత్తూరు



నేడు సదుంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణలో భాగంగా ఈ నెల 20న సదుం మండల ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని తెలిపారు.

ఓటే ఫర్ ఓపిఎస్

- ఓపిఎస్‌ను గెలిపించుకుందాం
- భవిష్యత్ భరోసా కోసం యుటిఎఫ్ నేతల ఆమరణ దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల తలరాతలను మార్చేందుకు యుటిఎఫ్ నాయకత్వం నడుం బిగించింది. నేడు.. రేపు అంటూ కల్లబొల్లి మాటలు చెప్పి ఉద్యోగ, ఉపాధ్యాయులను నిలువునా ముంచే ప్రయత్నం చేస్తూ జిపిఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)ను తీసుకొచ్చిన ప్రభుత్వ దుర్మార్గంపై తుదిపోరుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తున్న ప్రభుత్వం తీరు మార్చుకొని న్యాయం చేయాలంటూ విజయవాడలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం నిరాహార దీక్షలకు పూనుకుంటే గురువారం జిల్లా కేంద్రంలో యుటిఎఫ్ జిల్లా శాఖ నేతృత్వంలో ఐఖ్య ఉపాధ్యాయ పెడరేషన్ నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షలను చేపట్టారు. అలాగే 20వ తేదీ శుక్రవారం జిల్లాలోని ఆర్‌డిఒ కేంద్రాల్లో యుటిఎఫ్ నాయకత్వం నిరాహార దీక్షలకు పూనుకోనుంది. మొండిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై తాడోపేడు తేల్చుకొనేందుకు యుటిఎఫ్ ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకోవాల్సి వస్తోంది. పాతపెన్షన్ విధానం అమలు చేస్తానంటూ అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చికా ఉద్యోగ, ఉపాధ్యాయులను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఆది నుండీ పాత ఓపిఎస్ కోసం సుదీర్ఘ పోరాటాన్ని నడిపిన యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రస్థాయి నుండీ మండలస్థాయి దీక్షలకు పూనుకుంది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరంగా మారిన సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని తీసుకురావాలని యుటిఎఫ్ కోరుతోంది. ప్రభుత్వ మోసపూరితంగా జీపిఎస్‌ను వల్ల ప్రయోజం లేకపోగా అనర్థాలే అధికం. ప్రభుత్వం పొంతన లేని సమధానాలకు యుటిఎఫ్ ఓపిఎస్ అమలు చేయడం వల్ల ప్రభుత్వం ఎలాంటి భారం ఉండబోదని స్పష్టంగా తెలియజేసింది. సిపిఎస్, జిపిఎస్ విధానాలను అంగీకరించమని పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి, చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, జివి.రమణ డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు గురువారం చిత్తూరులోని ఆర్డీవో కార్యాలయం ఎదుట పాతపెన్షన్ సాధనకై నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాండియన్ దీక్షలో కూర్చున్న వారందరికీ పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాత పెన్షన్ అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలు చేస్తే వంద సంవత్సరాల వరకు ఆర్థిక భారమని చెప్పడం ఏమాత్రం సబబు కాదని అన్నారు. పాదయాత్ర హామీని అమలు చేయకుండా దేశానికి అంతటికి ఆదర్శమని చెబుతున్న జిపిఎస్ విధానం సిపిఎస్‌కు మరొక రూపం తప్ప ప్రత్యామ్నాయం కాదని విమర్శించారు.

2024 ఎన్నికల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకే ఉద్యోగ, ఉపాధ్యాయులు కుటుంబాలు మద్దతు ఇస్తాయని తెలిపారు. ఓపిఎస్ అమలు చేసి ప్రజల పక్షాన ఉంటారా.. జిపిఎస్ అమలు చేసి కార్పొరేట్ల పక్షాన ఉంటారా ప్రభుత్వాలే నిర్ణయించుకోవాలని అన్నారు. 33 సంవత్సరాల పూర్తయితేనే 50శాతం పెన్షన్ ఇచ్చే జిపిఎస్ కాంట్రిబ్యూషన్ కట్టించడం ఉద్యోగుల పాలిట మరణ శాసనమని అన్నారు. ఐదు సంవత్సరాల కొనసాగితే ప్రజాప్రతినిధులకు జీవితాంతం పెన్షన్ వస్తున్నదని, 30 సంవత్సరాలు పైబడి చేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకేమో వద్ధాప్యం పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ వస్తున్నదని, ఇది ఏ రాజ్యాంగంలో ఉందో తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు.

ఈ దీక్షా శిబిరానికి మద్దతుగా ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.చెంగల్రాయ మందడి, జిల్లా అధక్షులు కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సోమశేఖర్ నాయుడు, జీవి రమణ,నాయకులు పి.సుధాకర్ రెడ్డి, పిఆర్.మునిరత్నం, రెహానా బేగం, సిపి.ప్రకాష్, ఏ.కష్ణమూర్తి, రెడ్డెప్ప నాయుడు, దక్షిణామూర్తి, ఎన్.మణిగండన్, డి.ఏకాంబరం, బి.ఈశ్వర మహేంద్ర, పిసి.బాబు, సరిత, ఎంవి.రమణ, జిల్లా సిపిఎస్ కన్వీనర్ శశికుమార్, వెంకటేశ్వర రెడ్డి యాదవ్, వంశీకష్ణ, వేంకటేశులు, మోహన్, రెడ్డెప్ప, నాగరాజ, యువరాణి దీక్షలలో కూర్చున్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

దీక్షలకు సిఐటియు మద్దతు...

పాతపెన్షన్ విధానం పునరుద్దరించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక నిరాహారదీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మద్దతుగా సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన శిబిరం వద్ద మాట్లాడుతూ 2004లో పెన్షన్ విధానం రద్దు చేసినప్పటి నుండి దేశవ్యాపితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగైదు సంవత్సరాలుగా ఉద్యమం సమరశీలంగా నడుస్తున్నదని ఈ పోరాటానికి సిఐటియు మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ పోరాటాన్ని అణచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నదని ఈ నిరాహారదీక్ష ఇతర సంఘాలకు, రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దు చేస్తానని గత ఎన్నికల్లో హామీనిచ్చారని, తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హామీలు నెరవేర్చినట్లు ఇతను కూడా నెరవేరుస్తాడని ప్రభుత్వ ఉద్యోగులు నమ్మారని, ఇప్పుడు తెలియక వాగ్దానం చేశానని ముఖ్యమంత్రి మోసపూరిత ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఉద్యోగులపట్ల విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని విమర్శించారు. సిపిఎస్ రద్దుకు చేస్తున్న పోరాటం న్యాయమైనదని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని, ఈ ఆందోళనకు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. సిపిఎస్ రద్దుపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరి ప్రకటించాలని కోరారు.



ఓపిఎస్‌ను అమలు చేయాలని కోరుతూ అమరణ నిరాహార దీక్షల్లో యుటిఎఫ్ నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి (యుటిఎఫ్)

పుంగనూరు: జిల్లా కేంద్రంలో పాత పెన్షన్ సాధనలో భాగంగా గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పుంగనూరు డివిజన్ యుటిఎఫ్ నేతలు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చి, నేడు ఓపిఎస్‌కు బదులుగా జిపిఎస్‌ను తీసుకురావడం దారుణమన్నారు. ఎవరైతే పాత పెన్షన్‌ను తిరిగి అమలు చేస్తారో వారికే తమ మద్దతు వుంటుందని స్పష్టం చేశారు. అన్నింటిలోనూ ఉపాధ్యాయ ఉద్యోగ, పెన్షనర్లకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ నాయకులు రమణ, రెడ్డెప్ప, చెన్నకేశవులు, నరేష్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల దీక్షలు మద్దతు తెలియజేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు



పుంగనూరులో..


జాతీయ స్థాయి ఇన్స్పైర్ ఎగ్జిబిషన్‌లో

సత్తా చాటిన బాలశాస్త్రవేత్తలు


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. గురువారం జిల్లా సచివాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులతో జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సకురా ప్రాజెక్ట్ అండ్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్‌లో ప్రదర్శించే జి బ్యాక్స్ స్మార్ట్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టుకు సంబంధించి కలెక్టర్‌కు వివరించారు. 9వజాతీయ స్థాయి ఇన్స్పైర్ ఎగ్జిబిషన్, ప్రాజెక్టు కాంపిటీషన్ ప్రదర్శనలో పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనపరిచి జపాన్‌లో జరిగే సకురా ప్రదర్శనకు ఎంపికైన గుడిపాల మండలం జడ్పీహెచ్‌ఎస్ ఏఎల్ పురం 8వ తరగతి విద్యార్థి కే.ప్రణయ గైడ్, టీచర్ శ్రీరంగలక్ష్మి, పీలేరు మండలం జంగంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న పడిగల చరణ్ తేజ్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి. రమణ, ఇతర సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రతిష్టలు పెరిగేలా ప్రాజెక్టులను ఎలా అభివద్ధి చేయాలో వారికి సూచనలు చేశారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి రమణ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి జిల్లా ప్రొఫెసర్ ఈశ్వర్ రామిరెడ్డి, ప్రొఫెసర్ శ్రీరామ్ సుందర్, పివికెఎన్ కాలేజ్ లెక్చరర్ భాను ప్రకాష్, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కుప్పం, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కుమార్ వీరందరి ఆధ్వర్యంలో జపాన్‌కు వెళ్లే ప్రోటో టైప్ ప్రాజెక్ట్స్ కం ఎగ్జిబిట్స్ మార్పులతో భవిష్యత్తు ప్రణీతంలో పరిశోధనాత్మకంగా మార్పులు చేర్పులతో మూడు దశలలో అభివద్ధి పరిచి సత్ఫలితాలతో బాలశాస్త్రవేత్తలను నుంచి జపాన్ సకురాలో నవంబర్ 5 నుండి 7వ తేదీవరకు జరిగే ప్రదర్శనలో పాల్గొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎంపి


లబ్దిదార్లకు చెక్కును అందిస్తున్న ఎంపి రెడ్డప్ప

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్.రెడ్డప్ప పేర్కొన్నారు. జగనన్న చేదోడు పథకం కింద రజక, నాయి బ్రాహ్మణ, టైలర్ వత్తిదారులకు నాలుగో విడత ఆర్థిక సాయం కింద రూ. 10,000 ఆర్థిక లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముద, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ జోనల్ చైర్‌పర్సన్ శైలజా రెడ్డి, జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ బాష, లబ్ధిదారులు వీక్షించారు. ఎంపీ ఎన్.రెడ్డప్ప మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పూర్తి పారదర్శకంగా అర్హులకు చేరవేయడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ. 2023-24 సంవత్సరంలో నాల్గవ విడత కింద 8,662 లబ్ధిదారులకు రూ.8.66కోట్లు ఆర్థిక లబ్ధి చేకూరడం జరిగిందని తెలిపారు. ఇదే విధంగా జగనన్న చేదోడు కింద గతంలో 2020-21 సంవత్సరంలో (మొదటి విడత) లబ్ధిదారుల సంఖ్య 8306 సాయం (రూ.8.31కోట్లు, 2021-22 సంవత్సరంలో (రెండవ విడత) లబ్ధిదారులసంఖ్య 8226 సాయం రూ.8.23 కోట్లు. 2022-23 సంవత్సరంలో (మూడవ విడత) లబ్ధిదారుల సంఖ్య 9477సాయం రూ.9.48 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు.

బాబుపై ఉన్నవన్నీ సాక్షాధారాలున్న కేసులే: రోజా

తెలుగుదేశం పార్టీకే గ్యారెంటీ పోయింది: మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి: బాబుపై ఉన్నవన్నీ సాక్షాధారాలతో ఉన్న కేసులే అని మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం చంద్రబాబు అరెస్ట్ అయిన కేసులకు సంబంధిత విచారణ 2017లోనే మొదలైందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కూడా ఆయనే అన్నారు. తీగలాగితే డొంకంతా కదిలిందన్నట్లు నాడు ఈడీ లాగిన తీగకు నేడు చంద్రబాబు డొంకంతా కదిలిందన్నారు. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం పాత్ర ఏముందన్నారు. తప్పించుకోవడానికి, జనంలో సానుభూతికే భువనేశ్వరి, లోకేష్, టీడీపీ శ్రేణులు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. బాబు తప్పు చేయలేదన్న ఆధారాలు, సాక్ష్యాలు ఉంటే అధికారులను, జడ్జిని సంప్రదించాలి గానీ మీడియా ముందుకు వెళ్లడం దేనికన్నారు. కోట్లకు కోట్లు పెట్టి రప్పించుకున్న లాయర్లపై నమ్మకం లేదా అని ప్రశ్నించారు. బాబుపై ఉన్నవన్నీ సాక్షాధారాలతో ఉన్న కేసులే అన్నారు. అన్నిటికీ శిక్షపడితే ఆయన జీవితాంతం జైల్లో ఉండాల్సిందే అన్నారు. భవిష్యత్తు గ్యారెంటీ అంటూ టీడీపీ నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారని చంద్రబాబు ఎప్పుడు వస్తారో గ్యారెంటీ లేదని, లోకేష్ జైలుకు వెళ్లడు అనడానికి గ్యారెంటీ లేదని, 175 స్థానాల్లో వంద స్థానాల్లో క్యాండెట్స్‌కు గ్యారెంటీ లేదని, దీంతో ఆ పార్టీ భవిష్యత్తుకే గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. నిజాలు మాట్లాడితే టీడీపీ నాయకులు క్యారెక్టర్ అసాసియేషన్ చేస్తున్నారన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు దేశానికి వెన్నుముకలు యువకులను విలువలతో పెంచడం, మహిళల్ని గౌరవించడం అందులో భాగమన్నారు. వీటిని విస్మరించి టీడీపీ నాయకులు మహిళల్ని నీచంగా మాట్లాడటం, చిన్న పిల్లలచేత నీచరాజకీయాలు మాట్లాడిస్తూ వాళ్లల్లో విషం నింపుతూ సాంప్రదాయలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. మహిళ గురించి ఎదో తెలిసినట్లుగా మాట్లాడి పేరుప్రతిష్టలను భ్రష్టుపట్టించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇలా మాట్లాడే వారిని ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు. తప్పు ఎక్కడ జరిపినా ఆపాలి తప్ప దాన్ని వీడియోలు, సెల్ఫీలు తీసుకొని ప్రచారం చేయకూడదన్నారు. ఎక్కడ మహిళలన్ని గౌరవిస్తారో అక్కడ దేవతలు కొలువుంటారన్నారు. అందుకే ముఖ్యమంత్రి ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతో అమలుచేస్తూ, రాజకీయంగా వారికి విలువనిస్తూ మహిళా సాధికారతకు బాటలు వేస్తున్నారన్నారు.

స్వేచ్ఛనిచ్చిన సమరయోధులను గౌరవించాలి

వారిని స్మరించుకోవడం మన బాధ్యత: మంత్రి రోజా


ర్యాలీలో పాల్గొన్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి: జన్మనిచ్చిన నేల తల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేందుకే నా మట్టి.. నా దేశం కార్యక్రమమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలో నియోజకవర్గస్థాయి నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఓంశక్తి ఆలయం వద్ద నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు దేశభక్తి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్‌లో జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. అన్ని మండలాల నుంచి వచ్చిన మట్టిని ఒకచోటకు చేర్చి ఆ మట్టిని చేతబట్టి ప్రతిజ్ఞ చేశారు. నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, వైస్‌చైర్మన్‌లు బాలన్, జయప్రకాష్, శంకర్, వెంకటరత్నం, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, విజయలక్ష్మి, జమున, మున్సిపల్ కమిషనర్లు వెంకట్రామిరెడ్డి, కెఎల్‌ఎన్ రెడ్డి, ఎంపీడీవోలు లీలామాదవి, ప్రసాద్, చంద్రమౌళి, భానుమూర్తి పాల్గొన్నారు.

స్వాత్రంత్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం: కలెక్టర్


మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

చిత్తూరుఅర్బన్: భారతదేశ సమగ్రతను దేశ ఔన్నత్యాన్ని కాపాడుదామని కలెక్టర్ ఎస్.షన్మోహన్ పిలుపునిచ్చారు. ఆజాదీ కాఅమత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం కలెక్టరేట్‌లో మేరా మట్టి మేరా దేశ్, కలశ యాత్ర ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ సమగ్రత సౌభ్రాతత్వాన్ని పెంపొందించే విధంగా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం చేపట్టి మట్టిని సేకరించి దేశ రాజధానిలోని పార్లమెంటుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 31 వరకు ఈకార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్ డిప్యూటీ కమాండెంట్ ఆశిష్, జడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, హౌసింగ్ పిడి పద్మనాభం, డీపీఓ లక్ష్మి, పివికెఎన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ భాను ప్రకాష్, జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి విజయ శంకర్ రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, జిల్లా టూరిజం అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న 25 నెలల బకాయి జీతాలను చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రన్, జిల్లా కార్యదర్శి ఎస్.గోవిందస్వామి నాయకత్వంలో గురువారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శి టీ.కోదండయ్య మాట్లాడుతూ కార్మికులకు సుమారు 25 నెలలు జీతాలు పెండింగ్లో ఉంటే ఆ కుటుంబాలు ఏవిధంగా పోషించుకోవాలని ప్రశ్నించారు. జీతాలు పెండింగ్లో ఉన్నాయని అనేక సందర్భాల్లో జిల్లా కలెక్టర్ దష్టికి, డిపిఓకి తీసుకెళ్లిన ఇప్పటికీ వరకు జీతాలు చెల్లించకపోవడం చాలా అన్యాయమన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కే.మణి, యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రాజేంద్ర, గోవింద్ స్వామి, యేసు పాదం, రవి, కష్ణయ్య, కుమార్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అపూర్వ స్పందన : మేయర్


జగనన్న హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న నగర మేయర్ అముద

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని నగర మేయర్ ఎస్.అముద చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 15వ వార్డు సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మేయర్ అముద, స్థానిక కార్పొరేటర్ సజనీరెడ్డి పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంరతం ఐసీడీఎస్, డ్వాక్రా మహిళల ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను సందర్శించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, ఏసీపీ రామకష్ణుడు, వైద్యులు, వార్డు కార్యదర్శిలు, వాలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ స్థాపించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని దాసరాపల్లి సర్పంచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం యాదమరి మండలంలోని దాసరపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సర్పంచ్ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఎంపీడీవో శివరాజ్ మాట్లాడుతూ ఈ శిబిరానికి విచ్చేసిన ప్రతి ఒక్కరూ వారికి అవసరమైన వైద్య సేవలు పొందాలన్నారు.ఉచితంగా మాత్రలు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యాదమరి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వృద్ధులకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని జడ్పిటిసి సోమశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని పాలేరు సచివాలయంలో సర్పంచ్ ప్రసాద్ ఒడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వద్దులకు బిపి షుగర్ ఈసీజీ పరీక్షలు చేసి, మందులు, కంటి అద్దాలు అందించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, కోఆప్షన్ నెంబర్ ఫిరోజ్ అహ్మద్, ఇంచార్జి తహశీల్దార్ అనిల్ కుమార్, వైద్యులు లోహిత్ చంగల్ రాయులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లిలో జడ్పిటిసి కేశవులు సర్పంచ్ విజయప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 319 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 103 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి వారి కంటి అద్దాలను అందించారు. ముగ్గురిని ఆపరేషన్ నిమిత్తం రెఫర్ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, వైద్యులు శాలిని, విజయ్ చంద్ర, సుమలత, భాస్కర్ బాబు, సౌజన్య, ఉమేసల్మా, జెడ్‌పిటిసి కేశవులు, ఎంపిపి ఎం.రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లిలో..


బంగారుపాళ్యంలో..


యాదమరిలో..

బాలయ్య సినిమా సందడి

జీజేఎం ట్రస్టు వారి ఉచిత షో



గురజాల జగన్‌మోహన్‌ను సన్మానిస్తున్న బాలయ్య అభిమానులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బాలయ్య బాబు అభిమానుల కోరిక మేరకు భగవంత్ కేసరి సినిమా ఫాన్స్ షోను ఉచితంగా ఏర్పాటు చేసిన గురజాల జగన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బాలయ్య అభిమానులు ఆధ్వర్యంలో గురజాల జగన్ మోహన్‌కి ఘనసన్మానం చేశారు. చిత్తూరు నగరంలోని స్థానిక గిరింపేట వద్ద పునర్నిర్మానంతో నూతన హంగులతో నిర్మించిన శ్రీవెంకటేశ్వర థియేటర్ గురువారం ప్రారంభమైన సందర్భంగా నందమూరి బాలకష్ణ నటించిన భగవంత్ కేసరి ఫాన్స్‌షోను సీనియర్ టిడిపి నాయకులు జీజేఎం ట్రస్ట్ చైర్మన్ గురజాల జగన్మోహన్ నాయుడు తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దసరా సందర్భంగా నందమూరి బాలకష్ణ వినూత్న కథతో నటించిన భగవంతు కేసరి విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. నూతన హంగులతో ఏర్పాటు అయినా శ్రీ వెంకటేశ్వర థియేటర్‌లో ఈ చిత్రం విడుదల కావడం చిత్తూరు నగర ప్రజలకు దసరా సంబరాలను తీసుకువచ్చిందన్నారు. నగర ప్రజలు నందమూరి అభిమానులు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని భారీఎత్తున విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు వినయ్ చౌదరి, హేమాద్రి నాయుడు, ఎల్‌బి నాయుడు, అన్వేష్, కిరణ్ పాల్గొన్నారు.

పగలే వెన్నెల..

రాత్రిపగలు వెలుగుతూనే వున్న వీధి దీపాలు



ప్రజాశక్తి- రొంపిచెర్ల: మండలంలోని రొంపిచెర్ల పంచాయతీ పరిధిలోని పాలెం వీధిలో విద్యుత్ దీపాలు పగలు కూడా వెన్నెలను తలపిస్తున్నాయి. ఈవిషయమై స్థానికులు అధికారులకు తెలియపరిచిన పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వారు విద్యుత్ ఆదా చేయాలని ప్రయత్నిస్తున్నా గ్రామాల్లో ఉన్న విద్యుత్ శాఖ ఉద్యోగులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి రాత్రిపూట మాత్రమే వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాబుకు అండగా ఉంటాం..

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎం.థామస్




ప్రజాశక్తి- వెదురుకుప్పం: చంద్రబాబుకు అండగా తాము సైతం ఉంటామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎం.థామస్ అన్నారు. గురువారం మండలంలోని పేరుమాలపల్లి పంచాయతీలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కె.లోకనాథరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళీ, యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీరాములు రెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ బోడిరెడ్డి రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువ పై శిక్షణ

ప్రజాశక్తి- కార్వేటినగరం: జగనన్న పాల వెల్లువకు సంబంధించి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మోహన్ మురళి, తహశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అదనపు ఆదాయం కల్పించి, వారు ఆర్థికంగా అభివద్ధి చేసేందుకు జగనన్న పాలవెల్లువలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి సచివాలయానికి ఒక సొసైటీని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లీటరుకు ఒక రూపాయి అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్వేటినగరం మండలంలో తొమ్మిది సొసైటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పశు వైద్యాధికారి డాక్టర్ కష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి వాలంటీర్లు పాడి ఆవుల వివరాలు క్రమంగా నమోదు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, పంచాయతీ పిఎస్ మణి, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల మృతికి మాజీ మంత్రి నివాళి




ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి తండ్రి పెద్ద గవిరెడ్డి గురువారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి రాజుపల్లి గ్రామానికి చేరుకోని గవిరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కత్తర్లపల్లి చెందిన సీనియర్ నాయకులు ఎస్.రెడ్డెప్ప అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ను కలసి పరామర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి చలపతి, భానుప్రతాప్ రెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

జగన్ మోహన్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి గ్రామానికి చెందిన జగన్మోహన్ మృతి తీరని లోటు అని యాదవ సాధికార సమితి కమిటీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్న యుగంధర్ అన్నారు. గురువారం జగన్ మోహన్ భౌతికకాయానికి నాయకులు వెంకటేష్, బుజ్జితో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.





తెల్లరాయి...తరలించేయ్..!

● ఎల్లలు దాటిస్తున్న 'అధికారం' ● అడవిలో రాత్రిపూట తవ్వకాలు ● 'అంతేగా'అంటున్న అధికారులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : రాత్రయితే చాలు తెల్లరాయి దొంగలు అడవిలో చొరబడుతున్నారు.. అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఎల్లలు దాటిస్తున్నారు. అటవీ, ప్రభుత్వ భూములను సైతం వదలకుండా కనిపించిన చోటల్లా ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా తవ్వకాలు చేసి లక్షలు ఆర్జిస్తున్నారు. అక్రమార్కులకు అధికార పార్టీ అండదండలు ఉండడంతో అటవీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో వైట్‌క్వార్ట్జ్ (తెల్లరాయి) వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. తెల్ల ఖనిజాన్ని లారీల్లో, ఇతర వాహనాల్లో ఎల్లలు దాటిస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్నారు. దీనివెనుక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాలాయిపల్లి మండలంలో కొన్నాళ్లుపోతే తెల్లరాయి కనుమరుగైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఎవరైనా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేస్తే 'చర్యలు తీసుకుంటాం' అని ఎపుడూ చెప్పే మాటే చెప్పి 'అంతేగా అంతేగా' అంటూ తలూపుతున్నారు.

తెల్లరాయికి విదేశాల్లో డిమాండ్

మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ, పెండేరెడ్డి పల్లి గ్రామాల పరిధిలోని అడవిలో తెల్లరాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలపై కన్నేసిన అక్రమార్కులు రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్‌తో విచ్చలవిడిగా ఖనిజాన్ని తవ్వితీస్తున్నారు. ఈ ప్రాంతాల్లో లభ్యమవుతున్న తెల్లరాయి నాణ్యతలో నెంబర్‌వన్‌గా ఉండటంతో విదేశాల్లో డిమాండ్‌తోపాటు మంచి ధర పలుకుతోంది. అడవిలో లభ్యమయ్యే ఈ తెల్లరాయికి మంచి ధర ఉంటుంది. సాధారణ రాయి అయితే టన్ను రూ.5వేలు. మొదటి శ్రేణి రాయి టన్ను రూ.25వేలు. ఇది ఒక టిప్పర్‌కి రూ.7.50 లక్షలు పలుకుతోంది. తెల్లరాయితో గాజు గ్లాసులు, గిన్నెలు తయారు చేస్తారు. ఇంకా రాయిని చిన్న చిన్న గుండ్రని రాళ్లుగా కత్తిరించి, నివాసాల్లోని పూలు, చెట్ల కుండీల్లో, అక్వేరియంలో ఉంచుతారు.. ఈ నేపథ్యంలో నాయుడు చెరువు కండ్రిగ, పెండేరెడ్డి పల్లి గ్రామాల్లో తాజాగా దివంగతులైన అధికారపార్టీ నేత కుమారుడు పేరుచెప్పుకుని తమకు ఆయన అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ, అడవుల్లో యథేచ్ఛగా అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

క్వారీని నిర్వహించాలంటే ముందుగా మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత తహసీల్దార్ ద్వారా ఎన్‌వోసీ తీసుకోవాలి. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి లభించాక క్వారీ పనులు చేపట్టాలి. భూమి నుంచి వెలికి తీసిన రాయికి టన్నేజీ ప్రకారం విలువకట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాలి. కానీ ఎలాంటి అనుమతులూ లేకుండానే అక్రమంగా ఇక్కడ తెల్లరాయిని తవ్వుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న క్వారీల అనుమతి పత్రాలతో అక్రమంగా తరలిస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి రావలసిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారు. అటవీ భూముల్లో యంత్రాల ద్వారా బావి ఆకారంలో గోతులు తీసి అందులో నుంచి రాయిని వెలికి తీస్తున్నారు. అనంతరం రోజువారీ కూలీల ద్వారా అవసరమైన మేరకు రాయిని సైజులుగా కొట్టిస్తున్నారు. దాన్ని రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా లారీలకు లోడ్ చేయించి చెన్నైకి తరలిస్తున్నారు. అక్కడి వ్యాపారులు వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. .

చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్

మండలంలో ఉన్న ప్రభుత్వ భూమిలో తెల్లరాయిని అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నట్టు మా దష్టికి వస్తే, వాహనాలు సీజ్ చేయడంతో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

ఓటిపిలపై తస్మాత్ జాగ్రత్త : డిఆర్ఓ



డిఆర్ఓ ఎన్.రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రభుత్వ పథకాల కోసం ఓటిపిల సేకరణపై సైబర్ నేరగాళ్లు దష్టి సాదించారని ప్రభుత్వ పథకాలు మంజూరు చేయిస్తామని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే ఎటువంటి ఓటిపిలతో కూడిన సమాచారం ఇవ్వవద్దని జిల్లా గ్రామవార్డు సచివాలయాల అధికారి ఎన్.రాజశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. అమ్మఒడి పథకానికి సంబంధించి నిధులు మంజూరు చేస్తామని ఓటిపిలు చెప్పాలంటూ అపరిచితులు ఫోన్ చేస్తున్నట్లు ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్టు తమకు సమాచారం అందినదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ పథకానికైన ఓటిపి అవసరం అయితే గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేయుచున్న సిబ్బంది నేరుగా లబ్దిదారుల వద్దకే వస్తారని అప్పుడు మాత్రమే ఓటిపిలు సిబ్బందికి ఇవ్వాలని తెలియజేసారు. గుర్తు తెలియని వ్యక్తుల, సైబర్ నేరగాళ్లు, అమ్మఒడి పథకానికి సంబందించి నిధులు మంజూరు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి ప్రజల ఖాతాలోని డబ్బులు కాజేసే ప్రయత్నం చేస్తున్నందున ప్రజలందరూ తక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామవార్డు సచివాలయాల అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

వ్యక్తి దుర్మరణం



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లంగాడు కోటూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నాగరాజు రావు తెలిపిన సమాచారం మేరకు బంగారుపాళ్యం మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీ గడ్డంవారిపల్లికి చెందిన రాజశేఖరరెడ్డి (57) బంగారుపాళ్యం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా తుంబుకుప్పం గ్రామం నుండి బంగారుపాళ్యంకు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. ఈ సంఘటనలో రాజశేఖర్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

సారావిక్రేత అరెస్ట్



ప్రజాశక్తి- నగరి: మండలంలోని ముడిపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్న ఎం.కుమరేశ్ (32) అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి అరెస్ట్ చేశారు. గురువారం నిర్వహించిన తనిఖీలో సారాను తీసుకువస్తున్న కుమరేశ్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ హిదయతుల్లా, బాలముని, విజయకుమార్, సతీష్, పీసీలు కార్తికేయన్, గురవయ్య, వళ్లి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలి

డిఎం అండ్‌హెచ్ఒ ప్రభావతిదేవి



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ ప్రభావతిదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతీదేవి ఆధ్వర్యంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖలో జిల్లాలోని ఆశా కార్యకర్తలకు హెచ్‌బీఎన్‌సి కిట్లు, శారీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లినప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి ఉపయోగించే (కొలమానికలను), యూనిఫామ్ శారీలు గురువారం పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అందరూ ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు విధిగా చిన్నపిల్లల పట్ల ఆరోగ్యపరిస్థితి తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఓ రేణుక ప్రభ, మలేరియా అధికారి శ్రీనివాసులు, డెమో జయరాముడు, వివిధ పిహెచ్‌సిల నుంచి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామిత్వ కార్యక్రమంపై ప్రత్యేక గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్

ప్రజాశక్తి- రొంపిచెర్ల: గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ అధ్యక్షతన స్వామిత్వ కార్యక్రమంపై ప్రత్యేక గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వామిత్వ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమం ద్వారా కలిగే ఉపయోగాలను లబ్దిదారులకు గ్రామ వాలంటీర్లు వివరించాలని తెలియజేశారు. స్వామిత్వ సర్వే జరిగే ప్రాంతాలను ముందు రోజే గ్రామ వాలంటీర్లకు తెలియజేస్తామని సర్వే జరిగే సమయంలో గ్రామ వాలంటీర్లు అందరూ సహకరించాలని కోరారు. నవంబర్ 2వ తేదీ నుండి పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆ సమయంలో వైఎస్సార్ ప్రభుత్వం ప్రజలకు అందిన ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించాలని, గ్రామ వాలంటీర్లు తగుసమాచారంతో ఈకార్యక్రమానికి హాజరవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర బాబు, గ్రామ సచివాలయాల కన్వీనర్ కరిముల్లా, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జననీ... జయశుభకారిణి



ప్రజాశక్తి- నగరి : పట్టణంలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవార్లకు వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు ఆయా ఆలయాలకు పోటెత్తారు. గురువారం బైపాస్ కూడలిలోని ఓంశక్తి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేకపూజలు, అన్నదానం నిర్వహించగా మంత్రి ఆర్కేరోజా, ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి స్కందమాత అలంకారం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. పట్టణ పరిధిలో కామాక్షిసమేత కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షిదేవికి అర్చకులు దుర్గాప్రకాష్ ప్రత్యేక పూజలు నిర్వహించి సరస్వతీ అలంకరణ చేశారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తికి గాయత్రి అలంకారం చేయగా, మూలవర్లకు ముత్యాల అలంకారం చేశారు. నత్తం కండ్రిగ కరుమారియమ్మ ఆలయంలో అమ్మవారికి కాలరాత్రిదేవి అలంకరణ చేయగా భక్తులను ఆకర్షించింది. స్థానిక భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి మూలవిగ్రహానికి దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారికి తమలపాకులతో అలంకరణ చేసి లలితా సహస్రనామ పారాయణం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిపించినట్టు ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు తెలిపారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో వెలసిన అల్లియెల్లమ్మ దసరా ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు పచ్చయమ్మన్ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సర్పంచ్ సుబ్రమణ్యం ఉభయదారులు శ్యామలమ్మ, ఆలయ పూజారి ఆనంద అయ్యంగార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: దేవి శరన్న నవరాత్రుల లో భాగంగా గురువారం మండలంలోని వజ్రాల బోయకొండ గంగమ్మ అర్ధనారీశ్వర అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ మహాలక్ష్మి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

సదుంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సదుం ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో 20వతేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుండి జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు, మండలస్థాయి అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ వరప్రసాద్, తహశీల్దార్ చంద్రశేఖర్‌లు గురువారం ఓ ప్రకటనతో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో ఇవ్వవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వాలంటీర్లు తప్పక హాజరు కావాలని తెలిపారు.

వృద్ధాశ్రమంకు రూ.75వేలు విరాళం



రాస్ కోఆర్డినేటర్‌కు చెక్కును అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని రాస్ వద్ధాశ్రమంకు దాలాస్ ఏరియా రాయలసీమ అసోసియేషన్ (అమెరికా) పచ్చికాపలం గ్రామంకు చెందిన ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, యూఎస్ఏ చెందిన హేమశేఖర్ రెడ్డి రూ.75వేలు విరాళం గా అందించారు. గురువారం మాజీ సర్పంచ్ మార్కొండయ్య, మాజీ సర్పంచ్ కె.దొరస్వామి రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ ధనంజయ వర్మ సమక్షంలో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్‌కు చెక్‌ను అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అమెరికాకు చెందిన దాతలు వద్ధాశ్రమం అభివద్ధికి విరాళం అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మోహన కుమారి, వద్దులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై రివ్యూ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సమావేశపు మందిరంలో 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు గత నెల 13వ తేదీ నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీల పురోగతిపై సంయుక్త కలెక్టర్‌చే రివ్యూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు, తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డిలు గురువారం ఓ ప్రకటనతో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు తప్పక హాజరు కావాలని తెలిపారు. ఈ రివ్యూ కార్యక్రమానికి హాజరయ్యేటప్పుడు గత స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలపై పురోగతికి సంబంధించిన అన్ని వివరాలను తమ వెంట తీసుకురావాలని కోరారు.

మళ్ళీ జగనే సిఎం కావాలి

రాష్ట్ర వైసిపి మహిళా అధ్యక్షురాలు కృపాలక్ష్మి

ప్రజాశక్తి - పాలసముద్రం: పేదరికాన్ని రూపమాపడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని అందుకే జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాల్సిన అవసరముందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె, రాష్ట్ర వైసిపి మహిళా అధ్యక్షురాలు కృపాలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలో పాలసముద్రం జడ్పీ పాఠశాలలో ఏపికి మళ్లీ జగనే సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం వైసిపి మండల కన్వీనర్ తులసి యాదవ్ అధ్యక్షతన జరిగినది. కృపాలక్ష్మి మాట్లాడుతూ ఇంటింటికి ప్రచారం చేపట్టేందుకు కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సిద్ధం కావాలన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేయాలని వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ప్రజాప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటి ప్రచారం చేపట్టేందుకు సిద్ధం కావాలని కోరారు. వైస్ ఎంపీపీ శేఖర్ మందడి, జడ్పిటిసి అన్బుగలన్, మాజీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గాలి మహేష్, ధనంజయ రెడ్డి, పోలయ్య, వరదరాజులు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దాం

ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం..

ప్రజాశక్తి- సోమల: మాదిగల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగ పోరాటానికి సంఘీభావంగా నవంబర్ 7వ తేదీ హైదరాబాదులో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు మాదిగల సత్తా చాటాలని పుంగనూరు మండల కన్వీనర్ వెంకటరమణ తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకష్ణ మాదిగ చేపట్టిన మహా పాదయాత్రకు సంఘీభావంగా పుంగనూరు నియోజకవర్గ కేంద్రం నుండి పాదయాత్ర చేస్తున్న దళిత సంఘాల నాయకులు గురువారం సదుం బస్టాండ్ కూడలిలో తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. 29 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ ఉన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారని పార్లమెంటులో జరిగే శీతాకాల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.